
**Andhra Jyothy**
**Title :**
**Author :**
**Location :**
**Article Date : 10/23/2011**

# ఫ్లోరోసెంట్లతో కళ్లకు ప్రమాదం

1 కేటరాక్ట్, టెరీజియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం

1 ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి



వాషింగ్టన్, అక్టోబర్ 22: విద్యుత్ పొదుపు చేద్దామని ఫ్లోరోసెంట్ దీపాలు వాడితే.. బిల్లులు తగ్గడం మాటేమో గానీ.. కళ్లకు మాత్రం ప్రమాదమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అతి నీలలోహిత కిరణాల కారణంగా వచ్చే కేటరాక్ట్, టెరిజియా వంటి కంటి వ్యాధులు వచ్చే అవకాశం ఫ్లోరోసెంట్ లైట్ల వల్ల 12 శాతం పెరుగుతుందని ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ విషయాలను పేర్కొంటూ అక్కడి ఓ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. '' ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వాడే లైట్ల వల్ల అయ్యే ఖర్చును తగ్గించుకునేందుకు ఫ్లోరోసెంట్లను వాడుతున్నారు. అవి అతినీలలోహిత రేడియేషన్‌ను విడుదల చేస్తాయి. 2వేల నుంచి 3.5వేల కెల్విన్ల వరకు.. 500 నానోమీటర్ల కన్నా తక్కువ తరంగదైర్ఘ్యం ఉండే అతినీలలోహిత కిరణాలను మన కళ్లు తట్టుకోగలవు. కానీ, ఇప్పుడు మార్కెట్లో లభిస్తున్న చాలా ఫ్లోరోసెంట్ లైట్లు ఆ ప్రమాణాలను దాటి ఉంటున్నాయి'' అని పరిశోధనకు నేతృత్వం వహించిన హెలెన్ వాల్ష్ అన్నారు. ఫ్లోరోసెంట్ల వల్ల లాభం రావడం ఏమోగానీ.. కంటి వ్యాధులతో బాధపడే వారి సంఖ్య మాత్రం పెరుగుతుందని హెచ్చరించారు.

**Andhra Jyothy**
**Title :**
**Author :**
**Location :**
**Article Date : 10/25/2011**

## తెలుగు పీఠాన్ని హైదరాబాద్‌లోనే

# ఏర్పాటు చేయాలి

1 **కేంద్రాన్ని కోరిన సీఎం.. ప్రారంభోత్సవం వాయిదా**



హైదరాబాద్, న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (ఆన్‌లైన్) : తెలుగు భాష విశేష అధ్యయన కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మానవ వనరుల శాఖకు సోమవారం లేఖ రాశారు. 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు లాంగ్వేజ్'ను మైసూరులో ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు లాంగ్వేజ్'ను ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం కిరణ్ విజ్ఞప్తి చేశారు. దానిని హైదరాబాద్‌లో కాకుండా మరో ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లయితే అది తెలుగు మాట్లాడే ప్రజలకు అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు. "ఎనిమిదిన్నర కోట్ల మందికి పైగా ప్రజలు తెలుగు మాట్లాడతారు. దాని చరిత్రను గుర్తించి కేంద్ర ప్రభుత్వం తెలుగుకు ప్రాచీన భాష హోదా కల్పించింది. తెలుగు భాషను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా.. తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించడానికి తెలుగు అకాడమీని, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. కానీ, కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు లాంగ్వేజ్' ను మైసూరులోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తెలుగు మాట్లాడే ప్రజలందరికీ సొంత ఇల్లు లాంటిది. అందువల్ల ఈ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించాలని విన్నవించుకుంటున్నాం" అని కేంద్రానికి రాసిన లేఖలో సీఎం పేర్కొన్నారు. కిరణ్ లేఖపై స్పందించిన కేంద్ర మానవ వనరుల సహాయ మంత్రి పురందేశ్వరి తన శాఖ కేబినెట్ మంత్రి కపిల్ సిబల్‌కు నోట్ పంపినట్లు తెలిసింది. ఈ మేరకు మైసూర్‌లో తెలుగు పీఠం ప్రారంభాన్ని వాయిదా వేసుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సిబల్ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన తిరిగి వచ్చిన వెంటనే దీనిపై చర్చించనున్నట్లు సమాచారం. 29న మైసూరులో జరగాల్సిన తెలుగు విశేష అధ్యయన కేంద్రం ప్రారంభోత్సవాన్ని నిలిపివేసినందుకు కేంద్రమంత్రి పురందేశ్వరికి రాష్ట్ర హిందీ అకాడమీ ఛైర్మన్ ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర కేబినెట్ నోట్‌లో మార్పులు చేసి ఈ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## 'మైసూరులోనే ఏర్పాటు చేయాలి'

బెంగళూరు, అక్టోబర్ 24(ఆన్‌లైన్ ప్రతినిధి): కన్నడ నాట తెలుగు భాష, సాహిత్యాలపై పరిశోధనలు చేసే వారికి తెలుగు భాష విశేష అధ్యయన కేంద్రం అనువుగా ఉండేదని, దానిని తరలించాలనే ఆలోచన చేయడం దురదృష్టకరమని కర్ణాటక తెలుగు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఎ.రాధాకృష్ణరాజు వాపోయారు. మైసూరుకు తెలుగుపీఠం వస్తోందని ఎంతో సంతోషించామని తీరా రాదని తెలుస్తుండడంతో బాధగా ఉందని బెంగుళూరు విశ్వ విద్యాలయం తెలుగు విభాగం మాజీ అధిపతి ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు అన్నారు.

**Andhra Jyothy**
**Title :**
**Author :**
**Location :**
**Article Date : 10/25/2011**

# తెలుగు వెలగాలి

విశిష్ట భాషగా తెలుగు అధ్యయనం కోసం ఒక ప్రత్యేక పీఠాన్ని మైసూరులోని భారతీయ భాషల అధ్యయన కేంద్రం (సిఐఐఎల్)లో ఏర్పాటు చేయడంపై చెలరేగిన వివాదం పరిష్కారమైనట్టు కనిపిస్తున్నది. ఈ నెలాఖరులో తలపెట్టిన ఈ కేంద్రం ప్రారంభోత్సవాన్ని విరమించుకుంటున్నట్టు, కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి కేంద్రప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు తెలియవస్తోంది. రాష్ట్ర హిందీ అకాడమీ చైర్మన్, భాషావేత్త అయిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తెలుగుదేశం అధ్యక్షులు చంద్రబాబునాయుడు మైసూరులో కేంద్రం ఏర్పాటుపై తీవ్రమైన అభ్యంతరం తెలియజేసిన తరువాత, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం సోమవారం నాడు కేంద్రానికి ఈ విషయమై లేఖ రాశారు. తెలుగుభాషా కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాచీన భాషగా తెలుగు, కన్నడాలను గుర్తించిన తరువాత ప్రక్రియలో భాగంగా ఈ రెండు భాషల విశిష్ట అధ్యయన కేంద్రాలను మైసూరులో ఏర్పాటు చేయతలపెట్టారు. తెలుగు కేంద్రం ఏర్పాటుపై కొందరయినా వెంటనే ప్రతిస్పందించడం, అభ్యంతరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం హర్షణీయం. తెలుగు భాషకు చేయవలసిన దోహదం గురించి, చేకూర్చవలసిన హంగుల గురించి మున్ముందు కూడా ఇటువంటి స్ఫూర్తిని ప్రదర్శించడం అవసరం.

అయితే, మాతృభాషపై తెలుగుసమాజానికి చెందిన ముఖ్యుల ఆకాంక్షలెప్పుడూ అర్ధమనస్కంగానే ఉంటూ వచ్చాయని ఈ సందర్భంగా కూడా చెప్పుకోక, ఒప్పుకోక తప్పదు. ఇతర భాషల వారు కోరి గుర్తింపును తెచ్చుకున్న తరువాత మాత్రమే మేలుకొనడం, భాషాధ్యయన కేంద్రం ఏర్పాటు వంటి ప్రతిపాదనలు ఆచరణరూపం తీసుకున్న తరువాత మాత్రమే అభ్యంతరాలు చెప్పడం జీర్ణం చేసుకోలేని అంశాలు. తమిళభాష ప్రాచీనభాష గుర్తింపును సాధించిన తరువాత మాత్రమే మనం మేల్కొన్నాము. అంతకు ముందు ప్రాచీనభాషల ఎంపిక ప్రక్రియ గురించి మనకు తెలియదని కాదు, తెలుగుభాషకు కూడా విశిష్ట హోదా కావాలన్న ఆకాంక్ష వ్యక్తం చేయలేదనీ కాదు. కానీ, తమిళానికి విశిష్ట హోదాను తమిళనాడు వారు ఒక రాజకీయ ఆకాంక్షగా వ్యక్తం చేయడమే కాదు, దాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరచారు. భాషకు ఒక ప్రత్యేక హోదాను కోరడానికి గానీ, కోరి సాధించుకున్నదాన్ని సద్వినియోగం చేసుకోవడానికి గానీ తమిళులకు ఉన్నంత పట్టింపు తెలుగువారికి ఉన్నదా అన్న సందేహం వస్తుంది. అందుకు కారణాలు మన నాయకుల నిర్లక్ష్యం మాత్రమే కాకపోవచ్చు, చారిత్రకమయిన కారణాలు కూడా ఉండవచ్చు. ఒక భాషాసమూహంగా తెలుగువారు తీవ్రమైన భాషాభినివేశం ఉన్నవారు కాకపోయి ఉండవచ్చు. చివరకు ప్రాచీనభాష హోదా సాధించుకున్న తరువాత అది వ్యాజ్యంలో చిక్కుకున్న తరువాత, తిరిగి ఆ అంశాన్ని పట్టించుకున్నవారు కనిపించలేదు. రెండున్నరేండ్ల కిందటే, మైసూరులోని భారతీయ భాషల అధ్యయన కేంద్రంలో తెలుగు కేంద్రం స్థాపన గురించిన ప్రతిపాదన వెళ్లింది. ఈ కేంద్రాన్ని రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం కూడా చేసింది. ఆ తరువాత ఇక ఆ విషయమై ఒక కన్ను వేసి ఉంచినవారు లేకపోయారు. తీరా, కేంద్రం భాషాకేంద్రానికి అనుమతినీ, నిధులనూ ప్రకటించిన తరువాత గానీ, కేంద్ర మానవవనరుల శాఖలోని భాషల విభాగంలో ఏమి జరిగిందో మనకు తెలియకపోయింది. రాష్ట్రప్రభుత్వానికి, సాంస్కృతిక విభాగానికి సమాచారం ఇవ్వకుండానే కేంద్రప్రభుత్వం ఈ ప్రక్రియను కొనసాగించిందని అంటున్నారు కానీ, అందుకు సైతం మన రాజకీయనాయకత్వానికి భాష విషయంలో ఉన్న అలక్ష్యధోరణే కారణమని చెప్పాలి.

మైసూరులోని భారతీయ భాషల అధ్యయన కేంద్రంలో తెలుగుపై వివక్ష చూపిస్తునారని, అక్కడ తెలుగువారి ప్రాతినిధ్యం కూడా తక్కువగా ఉన్నదని యార్లగడ్డ చేస్తున్న ఆరోపణలు తీవ్రంగా పరిగణించదగ్గవి. ఈ అంశాలను తెలుగుసమాజం దృష్టికి తెచ్చినందుకు ఆయనను అభినందించాలి. ఆ కేంద్రంలో తెలుగు పరిస్థితిని, తెలుగువారి సంఖ్యను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్నది, అందుకు పోరాడవలసిన కర్తవ్యం అన్ని రాజకీయపక్షాల మీదా ఉన్నది. అయితే, అంతమాత్రాన అక్కడి నుంచి తెలుగు వ్యవస్థలను ఉపసంహరించుకోవాలనుకోవడం వివేకం కాదు. సిఐఐఎల్ కేంద్రప్రభుత్వం అధీనంలోని ఒక ప్రతిభాకేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్). ఆంగ్ల, విదేశీభాష అధ్యయనానికి ఇఫ్లు (పూర్వం సీఫెల్)ను హైదరాబాద్‌లో ఏర్పరచినట్టే, మైసూరులో భారతీయభాషల కేంద్రాన్ని ఏర్పరచారు. వివిధ భాషల మధ్య సమన్వయాన్ని, భాషావ్యవహర్తల మధ్య అనుబంధాన్ని ఏర్పరచడానికి నెలకొల్పిన సంస్థ అది. అక్కడ నెలకొల్పాలనుకున్న తెలుగుభాషా కేంద్రం నిర్వహించవలసిన కర్తవ్యం కూడా- వివిధ ప్రాచీన భాషల మధ్య, చరిత్రసంస్కృతుల మధ్య సంబంధాలను, ఆదాన ప్రదానాలను పటిష్టం చేయడం. విశిష్ట భాషగా తెలుగు హోదా నేపథ్యంలో తెలుగు భాషకు కావలసిన వ్యవస్థల, సదుపాయాల నిర్మాణానికి రాష్ట్రంలో మరో సంస్థను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్నది. ఐదుసంవత్సరాల కాలానికి మైసూరు కేంద్రానికి కేంద్రప్రభుత్వం కేటాయించింది 21 కోట్లు. ఆ మాత్రం డబ్బు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదా? అంతో, అంతకంటె ఎక్కువో రాష్ట్రానికి ఇవ్వడానికి కేంద్రం ప్రభుత్వం దగ్గర మాత్రం డబ్బు లేదా? మైసూరులో కేంద్రాన్ని ఉండనిస్తూనే, రాష్ట్రంలో మరో కేంద్రం స్థాపనకు డిమాండ్ చేయడం ఉచితంగా ఉండేది. దేశవ్యాప్తంగా, విదేశాలలోను ఎన్నిచోట్ల తెలుగు కేంద్రాలు, శాఖలు ఉంటే భాషకు అంత మంచిది. బెనారస్ విశ్వవిద్యాలయంలోను, బరంపురం యూనివర్సిటీలోను, మద్రాస్ యూనివర్సిటీలోను, మదురైకామరాజ్ విశ్వవిద్యాలయంలోను తెలుగు విభాగాలున్నాయి. అమెరికాలోని టెక్సస్ యూనివర్సిటీలో తెలుగు కేంద్రానికి శాశ్వత స్థాయి ఏర్పడనున్నదని ఈ మధ్యే వార్తలు వచ్చాయి. ఇవన్నీ మరింత వృద్ధి చెందాలని, మరిన్ని కొత్త స్థలాల్లో తెలుగు కేంద్రాలు ఏర్పడాలని మనం కోరుకోవాలి.

తెలుగు కోసం చేయవలసినవి, ప్రభుత్వాన్ని నిలదీయవలసినవి చాలా ఉన్నాయి. అధికారభాషగా అమలుచేయడంలో చిత్తశుద్ధి లేకపోవడం, కనీసం ఒక అంశంగా తెలుగును నిర్బంధం చేయలేకపోవడం, ఇంటర్మీడియెట్ దశలో తెలుగు దాదాపుగా అంతరించిపోవడం- ఇవన్నీ తక్షణం ఉద్యమించవలసిన సమస్యలు. ప్రాచీన కావ్యాలను అర్థం చేసుకుని, వ్యాఖ్యానించగలిగిన పండితులను రూపొందించే ప్రాచ్యవిద్యాసంస్థలను మూసివేయడం ప్రభుత్వం భాషకు చేస్తున్న పెద్ద ద్రోహం. తెలుగుభాష కోసం ఒక శాశ్వత నిఘంటు పీఠాన్ని ఏర్పాటుచేసి, భాష ఆదాన ప్రదానాలను నియమబద్ధం చేయడం, మౌలిక శాస్త్ర అంశాలను తెలుగులో చెప్పగలిగే ప్రమాణభాషను రూపొందించడం, వివిధ వృత్తి, కుల, వర్గ, ప్రాంత మాండలికాలను ప్రమాణభాషలో సంలీనం చేయడం- అతిపెద్ద కర్తవ్యాలు. వీటి గురించి మాట్లాడకుండా, ఏదో ఒకటి రెండు కేంద్రాల గురించి, కొద్దిపాటి నిధుల గురించి ఆందోళన చేయడం వల్ల సాధించేది స్వల్పం. తెలుగుభాషాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో, ఆవేశరహితంగా కార్యాచరణను రూపొందించడం నేటి అవసరం.

# తెలుగు భాషా కేంద్రం మైసూర్‌లోనా!?



- **రాష్ట్రానికి మార్చాలని పురందేశ్వరికి యార్లగడ్డ లేఖ**

న్యూఢిల్లీ, అక్టోబర్ 19 (ఆన్‌లైన్): తెలుగు ప్రాచీన భాషా కేంద్రాన్ని మైసూరులో ఏర్పాటు చేయటం పట్ల రాష్ట్ర హిందీ అకాడమీ ఛైర్మన్ ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ కేంద్రాన్ని రాష్ట్రానికి మార్పించాలని కోరుతూ కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరికి బుధవారం ఆయన లేఖ రాశారు. ఏపీ భవన్‌లో యార్లగడ్డ విలేకరులతో మాట్లాడారు. మైసూరులోని భారతీయ భాషల కేంద్రంలోనే తెలుగు భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నప్పటికీ, దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి, సాంస్కృతిక విభాగానికి సమాచారం ఇవ్వలేదని చెప్పారు. ఈ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు చేయాలని అసెంబ్లీ గతంలోనే ఏకగ్రీవ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. తెలుగు భాషా కేంద్రం ఏర్పాటుపై తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పురందేశ్వరిని యార్లగడ్డ తన లేఖలో కోరారు. మైసూరులోని భారతీయ భాషల కేంద్రంలో తెలుగుభాషకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఈ సందర్భంగా యార్లగడ్డ తెలిపారు. ఇక్కడ 2001 నుంచి దూరవిద్య ద్వారా తెలుగు కోర్సును అందించడం నిలిపేశారని, 2004లో ప్రారంభించిన భాషా మందాకిని ప్రాజెక్టులో తెలుగు భాషను తొలగించి బెంగాలీ భాషను చేర్చారని ఆయన చెప్పుకొచ్చారు. ఇక 2008లో తెలుగు విశ్వవిద్యాలయంతో కలిసి తెలుగు భాషా మందాకిని ప్రాజెక్టు చేయటానికి కుదిరిన ఒప్పందాన్ని కూడా సరిగా అమలు చేయడం లేదన్నారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రాజెక్టులోనూ తెలుగుకు అన్యాయం జరుగుతోందన్నారు. జాతీయ అనువాద మిషన్‌లో పాలుపంచుకుంటున్న సుమారు వంద మంది భాషా కోవిదుల్లో తెలుగు వారు ముగ్గురు మాత్రమే ఉన్నారన్నారు. ఎల్‌డీసీఐఎల్ (లింగ్విస్టిక్ డేటా కన్సార్టియం ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్)లోనూ 70 మందిలో తెలుగు వారు ఒక్కరే ఉండటం దురదృష్టకరమన్నారు. మొత్తంగా భారతీయ భాషల కేంద్రంలో వివిధ ప్రాజెక్టుల్లో 350 మందికిపైగా పనిచేస్తుంటే, తెలుగు వారు మాత్రం ఐదుగురే ఉన్నారని.. ఈ పరిస్థితిని సవరించాలని పురందేశ్వరిని యార్లగడ్డ కోరారు.